సాక్షి మహబూబ్‌నగర్

మంగళవారం ‣ 21 ‣ మార్చి ‣ 2023



మామిడి రైతు కుదేలు

వాతావరణం, తెగుళ్ల కారణంగా మామిడి రైతుల ఆశలు అడియాసలయ్యాయి.

వివరాలు 8లో ▸



కేంద్ర బృందం పరిశీలన

మానవపాడు పీహెచ్‌సీని నేషనల్ క్వాలిటీ అసోరెన్స్ బృందం సందర్శించింది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం 31.6 /18.5

వాతావరణం

ఉదయం చలి ఉండటంతోపాటు ఆకాశం తేలికపాటి మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సాధారణంగా మారుతుంది.

న్యూస్‌రీల్

ఇంటర్‌లో ఆరుగురు విద్యార్థుల డీబార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలో కొన సాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఆరుగురు విద్యార్థులు డీబార్ అయ్యారు. సోమవారం మొదటి సంవత్సరం వారికి గణితం, బాటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలు జరిగాయి. ఈ క్రమంలో కోయిల్‌కొండ పరీక్ష కేంద్రాన్ని స్క్వాడ్ బృందం తనిఖీ చేయగా ఆరుగురు విద్యార్థులు చీటీలు రాస్తూ పట్టుబడ్డారు. పరీక్షకు మొత్తం 11,349 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా.. 10,909 మంది హాజరవగా.. 440 మంది గైర్హాజరయ్యారు. మరో ఆరుగురు డీబార్ అయ్యారు.

9 మంది ఇన్విజిలేటర్ల తొలగింపు

ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా అడ్డాకుల, దేవరకద్ర, కోయిల్‌కొండ పరీక్ష కేంద్రాలు సమస్యాత్మకం కావడంతో అధికారులు వాటిపై ప్రత్యేక దృష్టిసారించారు. ఈ నేపథ్యంలో స్క్వాడ్ బృందం అడ్డాకుల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన అనంతరం కోయిల్ కొండకు వెళ్లారు. ఇక్కడ ఆరుగురు విద్యార్థులు చీటీలు రాస్తూ పట్టుబడటంతో ఇందుకు బాధ్యులను చేస్తూ 9 మంది ఇన్విజిలేటర్లను విధుల నుంచి తొలగించినట్లు డీఐఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. అయితే వీరంతా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందే అని తెలుస్తుంది. వీరి స్థానంలో విద్యాశాఖకు సంబంధించిన ఉపాధ్యాయులకు పరీక్ష విధులు కేటాయించారు.

నేడు అవగాహన సదస్సు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): సకాలంలో టీడీఎస్ చెల్లింపులు, త్రైమాసిక నివేదికల సమర్పణ తదితర అంశాలపై జిల్లా అధికారులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కలెక్టర్ రవి నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు జిల్లా అధికారులు, డ్రాయింగ్, డిస్బర్సింగ్ అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. ఆదాయపు పన్ను శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదస్సులో అన్ని రాష్ట్ర ప్రభుత్వ చెల్లింపులు, ఇతర చెల్లింపులపై టీడీఎస్ 16, 16/ఏ ఫారాల సమర్పణలో ఇబ్బందులు తదితర అంశాలపై ఆదాయపు పన్ను శాఖ ఐఆర్ఎస్ అధికారి, జాయింట్ కమిషనర్ కృష్ణకుమార్, ఆదాయపు పన్ను అధికారి మధుసూదన్‌రావు హైదరాబాద్ నుంచి శిక్షణ ఇస్తారన్నారు.

డిమాండ్లు నెరవేర్చకుంటే ఉద్యమం



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకుంటే పెద్దఎత్తున ఉద్యమం చేసేందుకు ఉద్యోగులు సిద్ధంగా ఉండాలని విద్యుత్ ఉద్యోగుల సంఘం జేఏసీ కన్వీనర్ చంద్రమౌళి అన్నారు. సోమవారం స్థానిక విద్యుత్ భవనంలో విద్యుత్ ఉద్యోగుల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు ఈపీఎఫ్, జీపీఎఫ్ అమలు చేయాలని, ఆర్టిజన్, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. తమ న్యాయమైన కోరికలను తీర్చాలని విడతల వారీగా పోరాటం చేసినా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈ నెల 24న విద్యుత్ సౌధ ఎదుట మహాధర్నాకు పూనుకుంటున్నట్లు చెప్పారు. ఈ ధర్నాతో ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తెద్దామని పిలుపునిచ్చారు. అనంతరం మహాధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం చైర్మన్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధికి ఎగనామం!



గండేడ్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- క్రమంగా పనిదినాలు తగ్గిస్తున్న కేంద్ర ప్రభుత్వం
- నాలుగేళ్లుగా లేబర్ బడ్జెట్‌లో కోత
- ఇప్పటికే అనేక కొర్రీలతో నామమాత్రంగా మారిన పథకం
- కొత్త నిబంధనలతో పనులకు రాని కూలీలు
- పథకాన్ని ఎత్తి వేసే కుట్ర అంటున్న కార్మిక సంఘాలు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్)/ మహమ్మదాబాద్: వలసలను నివారించడంతో పాటు గ్రామాలకు చెందిన వారికి స్థానికంగా పని కల్పించాలనే సదుద్దేశంతో అప్పటి యూపీఏ ప్రభుత్వం మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. దీంతో ఎంతో మంది పేదలు స్థానికంగానే పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో ఉన్న 100 రోజుల పనిదినాలను క్రమంగా తగ్గిస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాలుగైదు ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం వెచ్చిస్తున్న లేబర్ బడ్జెట్‌ను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. తాజాగా ప్రకటించిన కేంద్ర బడ్జెట్‌లోనూ ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడం దీనికి బలం చేకూరుస్తోంది. ఇప్పటికే అనేక ఆంక్షలతో ఉపాధి హామీ పథకం నామమాత్రంగా కొనసాగుతుంది. దీనికితోడు సకాలంలో కూలి డబ్బులు రావడం లేదనే కారణంతో పనులు చేసేందుకు కూలీలు సైతం ముందుకు రావడం లేదు.

రెండేళ్లలోనే 20 లక్షలు..

గడిచిన ఐదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పనిదినాలు పరిశీలిస్తే క్రమంగా తగ్గిస్తూ వస్తుంది. 2018–19 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు 40 లక్షల పనిదినాలు కల్పించారు. 2019– 20లో 48 లక్షలకు, 2020– 21లో 41.86 లక్షలకు పెంచారు. కానీ, 2021– 22 సంవత్సరంలో 35.97 లక్షలకు తగ్గించగా.. ప్రస్తుత 2022– 23 సంవత్సరంలో 28.06 లక్షల పనిదినాలకు పరిమితం చేసింది.

గ్రామానికి 20 పనులు..

ప్రతి పంచాయతీకి 20 చొప్పున పనులు కేటాయించారు. వీటికి కూలీలు ఎక్కువగా హాజరై సకాలంలో పూర్తి చేస్తేనే మరో పనిచేసే అవకాశం ఉంటుంది. గతంలో ఎక్కువ మంది కూలీలు హాజరైతే 15 శాతం పనిదినాలను పెంచుకునే వెసులుబాటు ఉండేది. ప్రస్తుతం పనులకు హాజరైన కూలీల సంఖ్య, పనుల కేటాయింపు, చెల్లింపులు అన్ని ఆన్‌లైన్‌లోనే నిర్వహించాల్సి వస్తుంది. దీంతో కూలీల డిమాండ్‌కు అనుగుణంగా పనులు కల్పించలేని పరిస్థితి ఏర్పడనుంది. ప్రస్తుతం రోజు వారి కూలీ రూ.257గా నిర్ణయించారు. నిర్ణీత కొలత ప్రకారం పని పూర్తి చేస్తేనే ఈ కూలీ చెల్లిస్తారు. కానీ, కొలతల ప్రకారం పనులు జరగకపోవడంతో కూలీలకు రూ.200లకు మించి రావడం లేదు.



వారంలో కొత్త బడ్జెట్

వచ్చే ఏప్రిల్ నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమవుతుంది. ఈ సంవత్సరానికి చెందిన లేబర్ బడ్జెట్ వారం రోజుల్లో వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఇందుకుగాను జిల్లాలో ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించి ఉపాధి హామీ పథకం పనుల ప్రణాళికను ఖరారు చేశారు. ఇందులో కందకాలు తవ్వకం, వ్యవసాయ భూముల అభివృద్ధి, హరితహారం, రాళ్ల కట్టలు, మట్టి కట్టలు, చెరువుల్లో పూడికతీత, కాల్వల తవ్వకాల పనులు చేపట్టేందుకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ మేరకు గ్రామాల వారీగా చేపట్టాల్సిన పనులను గుర్తించి ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లో ఈ పథకానికి నిధుల కేటాయింపును తగ్గిస్తూ వస్తుంది. దీంతో కూలీల పనిదినాల్లో భారీగా కోత విధించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జిల్లా పరిధిలో ఇలా..

441 గ్రామ పంచాయతీలు	1.37 లక్షలు జాబ్ కార్డులు
89,000 యాక్టివ్‌గా ఉన్నవి	2.26 లక్షలు మొత్తం కూలీలు
1.35 లక్షలు ప్రస్తుతం పనిచేస్తున్నవారు	

200 రోజులకు పెంచాలి..



కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకానికి నిధులను తగ్గిస్తుంది. ఇప్పటికే బడ్జెట్‌లో 40% కోత పెట్టారు. రాష్ట్ర సాఫ్ట్‌వేర్ నుంచి ఎన్ఐసీ పరిధిలోకి వెళ్లడంతో కూలీలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. కూలీలకు ప్రతిరోజు రూ.600 కూలీ పడేలా చేయడంతో పాటు ప్రతి ఒక్కరికీ 200 పని దినాలు కల్పించాలి. అలాగే 20 రకాల పని నిబంధన ఎత్తివేయాలి.

– మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం

కొర్రీలు ఎత్తివేయాలి..



పని ప్రదేశం నుంచి రెండు పూటల ఫొటో క్యాప్చర్ పద్ధతి ఉండడం వల్ల కూలీలకు చాలా ఇబ్బందిగా మారింది. వెంటనే దాన్ని ఎత్తివేయాలి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రం ఆధీనంలోని ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ వచ్చాక రెండు రోజులకు కూలీ పడుతుందని చెప్పిన ప్రభుత్వం మూడు నెలలు అవుతున్న డబ్బులు రావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొర్రీలను ఎత్తివేసి కూలీలకు మేలు చేయాలి.

– బుచ్చన్న, టంకర, హన్వాడ మండలం

రెండు నెలలుగా..



ప్రస్తుతం ఎలాంటి వ్యవసాయ పనులు లేకపోవడంతో వలస వెళ్లే కంటే ఉపాధి హామీలో రెండు నెలలుగా లెవలింగ్ పనులు చేస్తున్నాం. ఇప్పటి వరకు మా కుటుంబంలో అందరికీ కూలి డబ్బులు రాలేదు. చేసిన పనికి డబ్బులు రాకుంటే కుటుంబం గడిచేది ఎట్ల. ఉపాధి పనుల్లో కూలీ డబ్బులకు ఆలస్యం ఎందుకు వెంటనే ఇప్పించాలి.

– రత్నబాయి, గువ్వోనికుంటతండా, మహమ్మదాబాద్

ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయొద్దు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రవినాయక్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): 'ప్రజావాణి'కి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని కలెక్టర్ రవినాయక్ అన్నారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజల నుంచి కలెక్టర్ ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను తిప్పుకోకుండా వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ అనిల్ కుమార్, డీఆర్‌డీఓ యాదయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గత సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఫిర్యాదులు దినోత్సవాన్ని రద్దు చేశారు. దీంతో ఈ వారం ప్రజలు పెద్దసంఖ్యలో తమ సమస్యలను విన్నవించుకునేందుకు వచ్చారు. అయితే ఉదయం 10 గంటల నుంచే ఫిర్యాదులు పెద్ద సంఖ్యలో కలెక్టరేట్‌కు రాగా.. కలెక్టర్ రాకపోవడంతో ఎదురుచూపులు తప్పలేదు.

రుణాలు ఇస్తలేరు..



మాది టంకర గ్రామం. నేను స్వయం సహాయక సంఘం శ్రీశైలం మల్లికార్జున మహిళా సంఘంలో సభ్యురాలిని. కానీ, మా సంఘానికి బ్యాంకు నుంచి వచ్చిన రుణం నాకు ఇవ్వడం ఇవ్వడం లేదు. రుణం రాకుండా సీసీ బాలకృష్ణమ్మ అడ్డుకుంటుంది. నాకు ఏమాత్రం సంబంధం లేని వ్యక్తికి చెందిన రుణం నన్ను చెల్లించాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. ఇది అన్యాయమని చెబితే బెదిరిస్తున్నారు. నాకు రుణం ఇప్పించి న్యాయం చేయండి.

– మహాలక్ష్మి, టంకర, హన్వాడ మండలం

'దళితబంధు' ఇప్పించండి



నాకు ఏ ఆధారం లేదు. ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధు పథకానికి నేను అర్హుడిని. ఈ పథకం నాకు వర్తింపజేయాలి. దళితబంధు ఇప్పిస్తే జీవనోపాధి పొందుతాను. 2015లో జరిగిన ఓ ప్రమాదంలో నాకు ఒక కాలు పూర్తిగా పోయింది. 2021 నుంచి దళితబంధు కోసం తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

– బాలయ్య, నంచర్ల

గడువు పెంచాలి



నిరుపేదలమైన మేము ప్రభుత్వం ప్రకటించిన నోటిఫికేషన్లకు ప్రిపేర్ అవుతున్నాం. అందుకోసం ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ప్రభుత్వం ఇస్తున్న ఉచిత కోచింగ్‌లో శిక్షణ పొందుతున్నాం. ప్రస్తుతం ఎస్సీ సర్కిల్‌లో ఇస్తున్న శిక్షణ అసంపూర్తిగా జరిగింది. అందుకు కోసం శిక్షణ కాలాన్ని పెంచితే మాకు న్యాయం జరుగుతుంది. నోటిఫికేషన్ పూర్తయ్యే దాకా మాకు అవకాశం కల్పించాలి.

బాధితులకు అండగా ఉంటాం: ఎస్పీ



బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకుంటున్న ఎస్పీ కె.నరసింహ

మహబూబ్‌నగర్ క్రైం: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోలీస్‌శాఖ చిత్త శుద్ధితో పనిచేస్తోందని, బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ కె.నరసింహ అన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 13మంది బాధితుల నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. సదరు ఫిర్యాదులు తీసుకున్న తర్వాత ఆయా పోలీస్‌స్టేషన్ అధికారులతో ఎస్పీ మాట్లాడి త్వరగా చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్ దృష్టికి వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిష్కరించడం, బాధితులకు న్యాయం చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తూ శాంతిభద్రతలకు భంగం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములు, డీఎస్పీ రమణారెడ్డి, ఎస్‌బీ సీఐ రాజు, ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



తెలంగాణ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

పాలమూరు: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్, జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి అన్నారు. సోమవారం జిల్లా బీజేపీ శాఖ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి తెలంగాణ చౌరస్తాలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రివర్గం నుంచి కేటీఆర్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ పరీక్ష రాసిన నిరుద్యోగులకు రూ.లక్ష చొప్పున పరిహారం ప్రకటించాలన్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యం వల్లే జరిగిందని, కేటీఆర్ బాధ్యతారహితంగా తమకు ఏం సంబంధం ఒకరిద్దరు చేశారని మాట్లాడటం దారుణం అన్నారు. పేపర్ లీక్ టెక్నికల్ అంశమైన దానికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నోటిఫికేషన్లు ఇచ్చి.. ఈ పేపర్లు దొంగవ్యవహారంగా నడిపించి ఇప్పుడు అక్టోబర్ నుంచి నిర్వహించిన పరీక్షలను రద్దు చేయాలని చెప్పడం చూస్తుంటే ఈ ప్రభుత్వానికి ఉద్యోగాలు భర్తీ చేయాలనే చిత్తశుద్ధి ఏ మేరకు ఉందో అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, నాయకులు ఎన్‌పీ వెంకటేష్, అంజయ్య, పాండురంగారెడ్డి, రాజేందర్‌రెడ్డి, రామాంజనేయులు, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఒప్పంద పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక ఎనుగొండలోని కేంద్రీయ విద్యాలయలో ఖాళీగా ఉన్న పోస్టులకు ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ కె.దశరథరాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యాలయంలో బయాలజీ, ఇంగ్లిష్, మాథ్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్, హిందీ సబ్జెక్టులు బోధించేందుకు పీజీటీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇంగ్లిష్, హిందీ, సంస్కృతం, మాథ్స్, సైన్స్ బోధించేందుకు టీజీటీల అవసరం ఉందన్నారు. అలాగే ప్రైమరీ టీచర్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, మ్యూజిక్‌లో పీఆర్‌టీలుగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. పీఈటీ, నర్స్‌తో పాటు బోధనేతర సిబ్బంది విభాగాల్లోనూ ఒప్పంద ప్రాతిపదికన నియామకాలు చేపట్టనున్నామన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 25న విద్యాలయ ప్రాంగణంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. దరఖాస్తులను https://mahabubnagar.kvs.ac.in వెబ్‌సైట్ నుంచి పొందవచ్చన్నారు.

వీఆర్‌ఏల ఉసురు తీస్తున్న ప్రభుత్వం



వీఆర్‌ఏ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జేఏసీ నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రభుత్వం వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం వీఆర్‌ఏల ఉసురు తీస్తుందని జేఏసీ జిల్లా చైర్మన్ రామచంద్రయ్య అన్నారు. గుండెపోటుతో మృతిచెందిన మహమ్మదాబాద్ మండలం రంగారెడ్డిపల్లికి చెందిన వీఆర్‌ఏ బాలయ్య మృతి పట్ల సంతాపం తెలిపారు. సోమవారం గ్రామానికి వచ్చి బాలయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పే స్కేల్ ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోవడంతో వీఆర్‌ఏలు గుండె పగిలి చనిపోతున్నారని ఆరోపించారు. కాలయాపన చేయడంతో వీఆర్‌ఏలు ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాన్ని పోషించుకోలేని దుస్థితికి చేరుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఎందరో వీఆర్‌ఏలు మృతిచెందుతున్నారని వాపోయారు. బాలయ్య కుటుంబాన్ని అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ మొదటి వారం వరకు వేచి చూస్తామని అనంతరం పే స్కేల్ జీఓ రాకపోతే మరో పోరాటం చేసేందుకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా కో కన్వీనర్ హన్మప్ప, మహమ్మదాబాద్ మండల చైర్మన్ గంగాధర్, కోచైర్మన్ హర్షవర్ధన్, గండేడ్ మండల చైర్మన్ నర్సింహులు, కో చైర్మన్ సత్తయ్య తదితరులు న్నారు.

మళ్లీ కరోనా ఛాయలు



పాలమూరు: ప్రజలను రెండేళ్ల పాటు ముప్పు తిప్పలు పెట్టి.. ఆర్థికంగా ఎంతో నష్టం చేకూర్చిన కరోనా మళ్లీ కోరలు చాచుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కరోనా పలు దశలుగా మార్పుకొని విస్తరిస్తోంది. కొత్తగా వ్యాప్తి చెందుతున్న వైరస్‌తో చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రతిఒక్కరికి దగ్గు, జలుబు, జ్వరం, గొంతు నొప్పిసమస్యలతో ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా కరోనా కేసుల పెరుగుదల అధికంగా లేనప్పటికీ.. ముందు జాగ్రత్త చర్యలు తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లుయెంజా హెచ్ 3 ఎన్2తో విస్తరిస్తోందని, ప్రతిఒక్కరు మాస్కులు ధరించడం, శుభ్రత పాటించాలని చెబుతున్నారు.

- జిల్లాలో విస్తరిస్తున్న వైరస్ వ్యాప్తి
- ఆరు రోజుల్లో 13 మందికి పాజిటివ్
- జనరల్ ఆస్పత్రిలో ప్రత్యేక ఏర్పాట్లు

822 మందికి పరీక్షలు

జిల్లాలో పది రోజులుగా 164 ఆర్టీపీసీఆర్, 658 మందికి ర్యాట్ పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేసిన పరీక్షల్లో 13 మంది కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. ఇందులో నలుగురు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉండగా మరో 9 మంది ఇంటి దగ్గర ఐసోలేషన్‌లో ఉంటున్నారు. ప్రస్తుతం జనరల్ ఆస్పత్రిలో 500 పడకలు ఆక్సిజన్ పడకలతోపాటు 80 ఐసోలేషన్ బెడ్లు అందుబాటులో పెట్టారు. దీంతోపాటు రెండు ఆక్సిజన్ ట్యాంకర్స్, కావాల్సిన పరికరాలు సిద్ధం చేసుకోవడం జరిగింది.



కరోనాపై మాక్ డ్రీల్ చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

వీరు జాగ్రత్తగా ఉండాలి

కొత్త వేరియంట్‌తో భయపడాల్సిన అవసరం లేదు. అయితే అజాగ్రత్తగా మాత్రం ఉండొద్దు. ముఖ్యంగా కరోనా తర్వాత వచ్చే అనారోగ్య సమస్యలు కొందరిపై తీవ్ర దుష్ప్రభావం చూపుతున్నాయి. కొత్త రకం వైరస్ పట్ల దీర్ఘకాలిక రోగులు, పెద్ద వయస్సు వారు, పిల్లలు, గర్భిణులు, అవయవ మార్పిడి చేసుకున్నవారు అప్రమత్తంగా ఉండాలని, జనంలోకి వెళ్తే తప్పకుండా మాస్కులు ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు.

పరీక్షలు చేస్తున్నాం..



ప్రస్తుతం కరోనా కేసులు పెరుగుతున్నాయి. ఇప్పటి వైరస్‌లో దగ్గు, జలుబు, జ్వరంతోపాటు కడుపు నొప్పి, వాంతులు, తలనొప్పి, మోషన్స్ వంటి లక్షణాలు అధికంగా ఉంటున్నాయి. ఎవరూ కూడా పరిస్థితి విషమించే వరకు నిర్లక్ష్యం చేయరాదు. ఏదైనా లక్షణాలు ఉంటే పరీక్షలు చేసుకోవడం లేదా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుడి దగ్గర చికిత్స తీసుకోవడం మంచిది. ప్రస్తుతం రద్దీ సీజన్ వల్ల పెళ్లిళ్లు, జాతరలు అధికంగా ఉన్నాయి. ప్రతిఒక్కరూ మాస్క్ ధరించడంతోపాటు చేతులు శుభ్రంగా పెట్టుకోవాలి. ప్రభుత్వ ఆస్పత్రిలో చాలా వరకు ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేస్తున్నాం. అత్యవసరమైన వారికి మాత్రమే ర్యాటీ పరీక్షలు చేస్తున్నాం.

– రామకిషన్, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్యపై కేసు నమోదు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని పరిమళ రాజు(29) ఆదివారం ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన మృతిచెందాడు. అతని భార్య పరిమళ గీత సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలియజేశారు. మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని తెలపడంతో అలంపూర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలియజేశారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

కోస్గి: జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని చంద్రవంచకు చెందిన సాయిలు(30) గతంలో పెళ్లి కాగా మొదటి భార్య చనిపోయింది. కుటుంబ సభ్యులు రెండో వివాహం చేశారు. రెండో భార్య సైతం భర్తను వదిలి పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 11న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి అక్కడ నుంచి హైదరాబాద్ తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి చిన్నాన్న వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

కారు, బైక్ ఢీ: వ్యక్తి దుర్మరణం


కురుమూర్తి (ఫైల్)

వనపర్తి క్రైం: ఎదురెదురుగా కారు–బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం వనపర్తి మండలం చిమనగుంటపల్లిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. వనపర్తి మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన కురుమూర్తి(40) పనుల నిమిత్తం బైక్‌పై వనపర్తికి వెళ్లాడు. స్వగ్రామానికి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో చుట్టుపక్కల వారు చూసి పోలీసులకు, అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతునికి భార్య బుచ్చమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఆధారాల సేకరణ

లింగాల: మండలంలోని అవుసలికుంటలో ఈ నెల 14న రాత్రి వేర్వేరు ఇళ్లలో జరిగిన దొంగతనాలకు సంబంధించి సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రం నుంచి వచ్చిన క్లూస్‌టీం సోదాలు నిర్వహించింది. రంగినేని శ్రీనివాసరావు ఇంటిలో రూ.80 వేలు, ఎత్తం నాగేశ్వర్‌రావు ఇంట్లో రెండు తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.10 వేల నగదును అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు క్లూస్‌టీం వివరాలు సేకరించినట్లు పోలీసులు తెలిపారు.

దొంగతనం కేసులో ఆరు నెలల జైలుశిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: రైలులో దొంగతనం చేసిన వ్యక్తి న్యాయమూర్తి జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. మహబూబ్‌నగర్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ క్రిష్ణ కథనం ప్రకారం.. కర్నూలు జిల్లా చిప్పగిరి గ్రామానికి చెందిన డేగులపాటి సత్యన్న 2020లో కర్నూలు నుంచి హైదరాబాద్ వెళ్లే యశ్వంత్‌పూర్ రైలులో దొంగతనం చేస్తూ మహబూబ్‌నగర్ పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో పట్టుబడ్డాడు. అదేరోజు అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టి కేసు విచారణ కొనసాగుతున్న క్రమంలో సోమవారం కేసు విచారణకు రాగా సికింద్రాబాద్ ద్వితీయ ఎంఎమ్ రైల్వే కోర్టు న్యాయమూర్తి ఎండీ గౌస్‌పాష నేరస్థుడు సత్యన్నకు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. దీంతో నేరస్థుడిని జైలుకు తరలించినట్లు తెలిపారు.

మామిడి రైతు కుదేలు

- తెగుళ్లతో భారీగా పడిపోయిన దిగుబడి
- కొల్లాపూర్ నియోజకవర్గంలో కాపులేక తోటలు వెలవెల
- వాతావరణ మార్పులు, తేనెమంచు పురుగుతో నష్టం
- ఇటీవల కురిసిన వర్షానికి నేలరాలిన కాయలు


కొల్లాపూర్‌లో ప్రైవేటు వ్యాపారులు ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రం

కొల్లాపూర్: మూడేళ్లుగా మామిడి రైతులకు కడగండ్లే మిగులుతున్నాయి. ఈసారి మామిడి పూత విరగబూయడంతో పంట పండుతుందిలే అని అంతా సంబరపడ్డారు. కానీ వాతావరణ మార్పులు, విపరీతమైన తెగుళ్ల కారణంగా రైతుల ఆశలు అడియాసలయ్యాయి. ఇక కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రూ.లక్షలు వెచ్చించి తోటలను కౌలుకు తీసుకున్నవారు ఆర్థికంగా నష్టాన్ని మూటగట్టుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. మొత్తానికి ఈ ఏడాది దేశవ్యాప్త గుర్తింపు ఉన్న కొల్లాపూర్ మామిడిపండ్లకు కొరత ఏర్పడబోతోంది.

తేమశాతం పెరిగి..

ఈ ఏడాది మామిడి పూత అన్ని నియోజకవర్గాల్లో విరగబూసింది. డిసెంబర్‌లో చలి తీవ్రత, తేమశాతం పెరగడం, అకాలవర్షం కారణంగా పూత పెద్దమొత్తంలో రాలిపోయింది. అదే నెలలో రెండో దశ పూత వచ్చింది. వీటికి బూడిద తెగులు సోకి పూత ఎండింది. ఎక్కడైనా పూత నిలబడినా, పిందె దశలోనే తేనెమంచు పురుగుల కారణంగా బంక తెగులు సోకి కాయలు రాలిపోయాయి. దీంతో చాలాకొన్ని తోటల్లో మాత్రమే మామిడి కాపు మిగిలింది.


మామిడి కాయలు

ఆర్థికంగా కష్టాలు..

జిల్లాలో మామిడి తోటలను 14,458 మంది రైతులు సాగు చేస్తున్నారు. వీరిలో అధికశాతం మంది తమ తోటలను కౌలుకు ఇచ్చారు. కౌలు కోసం రైతులు లక్షలాది రూపాయలు వెచ్చించారు. ఏటా మామిడి కాపు సమయంలో నాలుగు నుంచి ఐదుసార్లు పురుగు మందులు పిచికారీ చేసేవారు. ఈసారి తెగుళ్ల బెడద ఎక్కువగా ఉండడంతో ఎనిమిది నుంచి పదిసార్లు పురుగు మందులు కొట్టినా ఫలితం లేకుండా పోయింది. ప్రధానంగా బంక తెగులును కంట్రోల్ చేయలేక రైతులు తోటలు వదిలేసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి.

అకాల వర్షాలతో మరింత నష్టం..

అసలే కాపు లేక విలవిల్లాడుతున్న రైతులను ఇటీవల అకాల వర్షాలు మరింత నష్టాలపాలు చేశాయి. పెద్దకొత్తపల్లి, కోడేరు మండలాల్లో మామిడి కాయలు పెద్దమొత్తంలో నేలరాలాయి. అచ్చంపేట, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల్లో కూడా కొన్ని ప్రాంతాల్లో మామిడి కాయలు రాలిపోయాయి.

జిల్లాలో మామిడి సాగు ఇలా...

నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 34,712 ఎకరాల్లో మామిడి సాగు జరుగుతోంది. వీటిలో అచ్చంపేట నియోజకవర్గంలో 2,418 ఎకరాల్లో, నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో 2,510 ఎకరాల్లో, కల్వకుర్తి నియోజకవర్గంలో 4,547 ఎకరాల్లో, కొల్లాపూర్ నియోజకవర్గంలో 25,237 ఎకరాల్లో తోటలు ఉన్నాయి. వీటిలో 70శాతం మేరకు తోటలు కాపు కాసేవి ఉన్నాయి. సాగు చేస్తున్న తోటల లెక్కల ప్రకారం ఈఏడాది 1,38,848 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారుల అంచనా. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో దిగుబడిలో కనీసం 50శాతం కూడా వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు.

దిగుబడి తగ్గినా.. ధర పెరగలే..

మామిడిపంట దిగుబడి తగ్గినా ధర మాత్రం పెరగడం లేదు. ప్రతి సంవత్సరం సీజన్ ప్రారంభంలో మామిడి కాయల ధర టన్నుకు రూ.1.20 లక్షల నుంచి రూ.1.60 లక్షల వరకు పలికేది. ఈ ధరలు మార్చి నెలాఖరు వరకు ఉండేవి. కానీ ఈసంవత్సరం ఫిబ్రవరి రెండో వారంలో టన్నుకు రూ.1.20లక్షల వరకు పలికింది. వెంటనే రూ.60 వేల నుంచి రూ.80 వేలకు పడిపోయింది. క్రమంగా తగ్గుముఖం పడుతోంది. దిగుబడి తగ్గినా ధర పెరగకపోవడానికి కారణం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి పెద్దమొత్తంగా మామిడి కాయలు హైదరాబాద్‌కు రావడమే. దీన్ని సాకుగా చూపి వ్యాపారులు రైతుల నుంచి తక్కువ ధరకే మామిడి కాయలను కొనుగోలు చేస్తున్నారు. కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, కల్వకోల్‌లో ఢిల్లీ, హైదరాబాద్‌కు చెందిన వ్యాపారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశారు. రూ.60 నుంచి రూ.75 వేల వరకు టన్ను మామిడి కాయలను కొనుగోలు చేస్తున్నారు. ఇదేరీతిన కొనుగోళ్లు సాగితే రైతులకు పంట దిగుబడి రాక, వచ్చిన కొద్దిపాటి పంటకు సరైన ధర లేక ఆర్థికంగా అన్ని రకాలుగా నష్టపోక తప్పని పరిస్థితి ఏర్పడింది.

ప్రభుత్వం ఆదుకోవాలి..



నేను 20 ఎకరాల్లో మామిడి తోటలు కౌలుకు తీసుకున్నా. రూ.23 లక్షలు కౌలు చెల్లించా. పురుగుమందుల కోసం రూ.లక్షలు ఖర్చుచేశా. ఈ ఏడు తోటలు మొత్తం తెగుళ్ల కారణంగా దెబ్బతిన్నాయి. నేను కౌలుకు తీసుకున్న టన్ను కాయలు కూడా వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. ఆర్థికంగా అన్ని రకాలుగా నష్టపోయిన కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. మామిడిలో తెగుళ్లను నివారించేందుకు ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సరైన మందులు సూచించాలి.

– గుడెమోని అంజన్‌కుమార్, మామిడి కౌలు రైతు, కొల్లాపూర్

నివేదిస్తాం..



వాతావరణంలో మార్పులు, తెగుళ్ల కారణంగా ఈసారి మామిడి దిగుబడి భారీగా పడిపోయింది. పంటనష్టం వివరాలు ఇంకా అంచనా వేయలేదు. సీజన్ చివరి దశలో పంట దిగుబడి అంచనాలు లెక్కిస్తారు. తేనెమంచు పురుగు ద్వారా సోకే బంకతెగులు ఈ సారి పంటను బాగా నష్టపర్చింది. ఎన్నిరకాల మందులు కొట్టినా వారం, పది రోజుల కంటే ఎక్కువ పనిచేయలేదు. పంటనష్టం సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– లక్ష్మణ్, ఉద్యానశాఖ అధికారి, కొల్లాపూర్

గుప్తనిధుల కోసం విగ్రహం తొలగింపు


గుప్త నిధుల కోసం వినాయక విగ్రహాన్ని తొలగించిన దుండగులు

మిడ్జిల్: మండలంలోని కొత్తూర్ గ్రామ శివారులో గల వ్యవసాయ పొలంలో పురాతన వినాయక విగ్రహాన్ని ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం తొలగించినట్లు గ్రామస్తులు తెలిపారు. విగ్రహం తొలగించిన ప్రదేశంలో సోమవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ రాధిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపారు.

బాధితులకు నష్టపరిహారం అందజేత


చెక్కు అందజేస్తున్న ఎఫ్‌ఆర్‌ఓ ప్రభాకర్

మన్ననూర్: పెద్దపులి దాడిలో పాడిఆవు మృతిచెందిన సంఘటనలో వివిధ గ్రామాలకు చెందిన 6మంది బాధితులకు రూ.లక్షా 12వేలు నష్ట పరిహారంగా అందజేస్తున్నట్లు అమ్రాబాద్ ఎఫ్‌ఆర్‌ఓ ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్‌ఓ మాట్లాడుతూ పశువులు అటవీ ప్రాంతానికి మేత కోసం వెళ్లే క్రమంలో పెద్దపులి, చిరుతపులి దాడి చేసి చంపితే బాధితులకు కొంత కాలంగా నష్ట పరిహారం అందజేస్తున్నామని అన్నారు. అటవీ పరిసర ప్రాంతంలో ఎవరివైనా పశువులు పులి బారిన పడి మృతిచెందితే వెంటనే సంబంధిత బీట్ ఆఫీసర్లకు తెలియజేసినట్లయితే పంచనామా చేసి నెల రోజుల్లోనే అందుకు సంబంధించిన పరిహారం అందజేస్తామని అన్నారు. అదేవిధంగా వన్యప్రాణులకు ఎలాంటి హాని తలపెట్టినా అటవీశాఖ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీణారెడ్డి సోమవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన మహ్మద్ పాష శ్రీపురం రోడ్డులో డబ్బాను ఏర్పాటు చేసుకుని చిన్నపిల్లలకు తాయత్తులు కడుతుంటాడు. తన వద్దకు వచ్చిన ఓ మహిళకు మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. మహిళపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడటంతో పాటు మహిళ వద్ద నుంచి కొంత నగదును తీసుకున్నాడు. విషయం బయటకు చెబితే తన వద్ద ఉన్న వీడియోలను సోషల్ మీడియాలో పెడతానంటూ మహిళను బెదిరింపులకు గురిచేస్తున్నాడు. దీంతో బాధిత మహిళ సోమవారం జిల్లా ఎస్పీ మనోహర్‌ను ఆశ్రయించింది. ఎస్పీ ఆదేశాల మేరకు మహ్మద్ పాషపై రేప్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

నల్లమలలో విద్యార్థుల జంగిల్ సఫారీ


అటవీప్రాంతంలో పర్యటిస్తున్న విద్యార్థులు, అధికారులు

మన్ననూర్: స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులను అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, అటవీశాఖ ఆధ్వర్యంలో జంగిల్ సఫారీ చేయించారు. సోమవారం పిచ్చుక దినోత్సవం సందర్భంగా మన్ననూర్ ఎఫ్‌ఆర్‌ఓ ఈశ్వర్ ఆదేశాల మేరకు అటవీశాఖ ఎడ్యుకేషన్ అధికారి శ్వేత, ఎఫ్‌బీఓ శిల్పతో పాటు మరికొంత మంది సిబ్బంది గ్రామంలోని గిరిజన ఉన్నత పాఠశాల విద్యార్థులను సఫారీ వాహనాల్లో అటవీ ప్రాంతంలో టూర్ చేయించారు. పిచ్చుక దినోత్సవం ప్రాధాన్యతతో పాటు అటవీ అభివృద్ధి, వన్యప్రాణుల సంరక్షణ తదితర అంశాల గురించి వివరించారు.

పీహెచ్‌సీలో కేంద్ర బృందం పరిశీలన


వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ నవనీత్ రంజాన్ లక్నో, డాక్టర్ సౌమ్య కేరళ సభ్యులు

మానవపాడు: ఆరోగ్య కేంద్రంలోని కాన్పుల గదిలో అనిరకాల సౌకర్యాలు ఉన్నాయా? లేదా? ల్యాబ్‌లో అన్నిరకాల పరీక్షలు నిర్వహిస్తున్నారా? లేదా? నిర్వహిస్తే ఎంతమందికి పరీక్షలు చేస్తున్నారని నేషనల్ క్వాలిటీ అసోరెన్స్ స్టాండర్డ్ బృందం సభ్యులు డాక్టర్ నవనీత్ రంజాన్ లక్నో, డాక్టర్ సౌమ్య కేరళ పరిశీలించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని అని వసతులను పరిశీలించారు. ఎన్నిరకాల డ్రగ్స్ ఉన్నాయని అడిగారు. వ్యాక్సినేషన్ గదిని పరిశీలించి ఐఎల్‌ఆర్‌ను చూశారు. నేషనల్ ప్రోగ్రామ్‌లో భాగంగా మలేరియా, టీ.బీ, లైబ్రరీ, ఎన్‌సీఓ హెచ్ఐవీ తదితర వ్యాధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యకేంద్రం పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ ఇర్షాద్, రిజ్వాన, సత్యనారాయణ, చంద్రన్న, సంధ్యారాణి, తిరుమల్‌రావు, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలి


పీయూ మెయిన్ గేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు

- పీయూ విద్యార్థి జేఏసీ నాయకులు
- రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: టీఎస్‌పీఎస్సీ పోటీ పరీక్షల పేపర్ లీకేజీ ఘటనకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించి నిరుద్యోగ యువతకు క్షమాపణ చెప్పాలని పీయూ విద్యార్థి జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ సోమవారం పీయూ మెయిన్ గేటు వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీలో అవకతవకలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి బోర్డును ప్రక్షాళన చేయాలన్నారు. ఈ కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని, ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాల భర్తీ కొనసాగించాలన్నా రు. నిరుద్యోగ భృతిని ఇవ్వాలని కోరారు.

పండుగకు సొంత ఊరికి వచ్చి.. విద్యుదాఘాతంతో బాలిక మృతి


పావని(ఫైల్)

మల్దకల్: ఉగాది పండుగను సొంత ఊరిలో చేసుకుందామని వచ్చిన ఆ కుటుంబానికి పండుగ ఆనందం లేకుండా పోయింది. కన్న కుమార్తె పావని(14) వేడి నీళ్ల కోసం ఏర్పాటు చేసుకున్న హీటర్ కారణంగా విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడింది. దీంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మల్దకల్ మండలంలోని పెద్దపల్లికి చెందిన కిష్టన్న, పద్మమ్మ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. జీవనోపాధి కోసం కిష్టన్న దంపతులు పిల్లలతో సహా హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడే కూలి పనులు చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటున్నాడు. ఉగాది పండుగ కోసం కుటుంబ సభ్యులంతా స్వగ్రామానికి చేరుకున్నారు. సోమవారం ఉదయం స్నానం చేసేందుకు వేడి నీటి కోసం హీటర్‌ను ఏర్పాటు చేసుకోగా.. పావని(14) బకెట్‌లోని నీళ్ల వేడెక్కాయోలేదో తెలుసుకునేందుకు అందులో చేయి పెట్టింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడే పడిపోయింది. విషయం గమనించిన కుటుంబ సభ్యులు బాలికను గద్వాల ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే బాలిక మృతి చెందినట్లుగా వైద్యులు కుటుంబసభ్యులకు తెలియజేశారు. మృతిచెందిన బాలిక పావని హైదరాబాద్‌లో 9వ తరగతి చదువుకుంటుందని తండ్రి కిష్టన్న తెలియజేశారు. ఈ సంఘటనతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న గద్వాల మాజీ ఎమ్మెల్యే భరతసింహారెడ్డి, నాయకులు రామాంజనేయులు, రాజశేఖర్, కృష్ణంరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం తెలియజేశారు.

తొలగని ఆంక్షలు..

- పోలీస్ బలగాల మధ్య కొనసాగిన చిన్నోనిపల్లి రిజర్వాయర్ పనులు
- బిక్కుబిక్కుమంటున్న నిర్వాసిత కుటుంబాలు
- గ్రామ నలుదిక్కులా చెక్‌పోస్టులు
- పోలీసుల అదుపులోనే నిర్వాసితులు


చిన్నోనిపల్లి చుట్టూ పహారా కాస్తున్న పోలీసులు

గట్టు: మండలంలోని చిన్నోనిపల్లిలో ఆంక్షలు ఇంకా తొలగలేదు. పోలీసుల ఆంక్షల నేపథ్యంలో గ్రామంలోని వారెవరూ ఇంటి నుంచి వీధుల్లోకి వచ్చేందుకు జంకుతున్నారు. ఇళ్లలోనే బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. సోమవారం సైతం పోలీస్ బలగాల మోహరింపు నడుమ రిజర్వాయర్ పనులు కొనసాగాయి. ఇతర గ్రామాల నుంచి చిన్నోనిపల్లె వైపునకు వెళ్లే దారులన్నింటిలో బారికేడ్లతో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. కొత్త వారిని గ్రామం వైపు అనుమతించడం లేదు. ఎవరైనా వెళ్లినా వారి పూర్తి వివరాలు, వీడియో తీసుకున్న తర్వాతే అనుమతిస్తున్నారు. మీడియాను సైతం గుర్తింపు కార్డులు పరిశీలించిన తర్వాతే చిన్నోనిపల్లె వైపునకు వెళ్లడానికి పోలీసులు అనుమతిస్తున్నారు. మొత్తం మీద చిన్నోనిపల్లి గ్రామాన్ని నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. మగవారిని అందరినీ పోలీసులు అదుపులోకి తీసుకోగా.. వృద్ధులు, యువకులు, పిల్లలు పనులన్నింటిని వదిలేసి ఇళ్ల దగ్గరే ఉండిపోయారు.

చకచకా రిజర్వాయర్ పెండింగ్ పనులు

సోమవారం చిన్నోనిపల్లె రిజర్వాయర్ కట్ట పనులు జోరందుకున్నాయి. 625 మీటర్ల మేరకు రిజర్వాయర్ కట్ట నిర్మాణం పనులు మిగిలిపోగా, ఆ పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. గద్వాల ఆర్డీఓ రాములు, డీఎస్పీ రంగస్వామి, తహసీల్దార్లు సుబ్రమణ్యం, జుబేర్ అహ్మద్‌లతో పాటుగా ఇంజనీరింగ్ అధికారులు దగ్గరుండి పనులు పర్యవేక్షిస్తున్నారు. వాగు దగ్గర వదిలేసిన రిజర్వాయర్ కట్ట గ్యాప్‌ను పూర్తి చేయడంతో పాటుగా స్లూయిజ్, అలుగు పనులు పూర్తి చేస్తే రిజర్వాయర్ పనులు వంద శాతం పూర్తయినట్లే అని సాగు నీటి శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం చిన్నోనిపల్లె వాగు దగ్గర వదిలేసిన గ్యాప్‌ను పూడ్చితే వానాకాలంలో చిన్నోనిపల్లె, ఇందువాసి వాగుల నుంచి వచ్చిన వర్షపు నీటితో రిజర్వాయర్ నీరు గ్రామంలోకి వచ్చి చేరతాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిరసనకారుల్లో ఆరుగురి విడుదల

రిజర్వాయర్‌ను రద్దు చేయాలంటూ నిరసన దీక్షలు చేపట్టిన చాగదోన, చిన్నోనిపల్లె, లింగాపురం, ఇందువాసి, బోయలగూడెం నిర్వాసిత రైతులను శనివారం అర్ధరాత్రి పోలీసులు అదుపులోకి తీసుకోగా.. రెండు రోజులుగా వారి అదుపులోనే ఉన్నారు. అయితే, వయస్సు, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆరుగురిని వదిలేసినట్లు తెలిసింది. మిగతా వారు పోలీసుల అదుపులో ఉండిపోయారు.

పునరావాసంలో సమస్యలు

చిన్నోనిపల్లె ముంపు గ్రామస్తులకు ఎర్రగట్టు దగ్గర పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే, పునరావాస కేంద్రం వద్ద ఎలాంటి సౌకర్యాలు లేవని, అక్కడికి వెళ్లి ఎలా ఉండాలని నిర్వాసిత కుటుంబ సభ్యులు వాపోతున్నారు. అధికారులు చెబుతున్నట్లు రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్, తాగునీటి ట్యాంకు ఏవీ లేవని ఆందోళన వ్యక్తం చేశారు. ఇండ్ల నిర్మాణానికి కొన్ని ప్లాట్లు అనుకూలంగా లేవని, అలాంటి చోట కేవలం పునాది తవ్వుకుని పూడ్చేందుకు రూ.లక్షలు ఖర్చు చేసే పరిస్థితి ఉన్నట్లు నిర్వాసితులు ఆరోపిస్తున్నారు.

కలెక్టర్‌ను కలిసేందుకు ప్రయత్నం

చిన్నోనిపల్లె రిజర్వాయర్‌లో భూములను కోల్పోతున్న ఇందువాసి గ్రామానికి చెందిన నిర్వాసిత కుటుంబాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున సోమవారం కలెక్టర్‌ను కలిసిందేకు ప్రత్యేక వాహనంలో తరలి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐలు మంజునాథరెడ్డి, పవన్‌కుమార్ పోలీస్ సిబ్బందితో అక్కడికి వెళ్లి వారితో మాట్లాడారు. కొద్ది మంది మాత్రమే వెళ్లి కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం ఇవ్వాలని, వివాదాలు సృష్టిస్తే మాత్రం ఇబ్బంది పడాల్సి వస్తుందని సూచించారు. దీంతో కొద్ది మంది రైతులు మాత్రమే కలెక్టర్‌ను కలిసేందుకు బయలుదేరివెళ్లారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నారాయణపేట రూరల్: పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన ముగ్గు ఉషేనప్ప(23) ఆదివారం రాత్రి నారాయణపేట మండలం అప్పక్‌పల్లి గ్రామానికి తన ద్విచక్ర వాహనంపై వెళ్లి, తిరిగి వస్తున్నాడు. అదే సమయంలో కోటకొండకు చెందిన చంద్రప్ప, బైక్‌పై నారాయణపేట నుంచి తన గ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో రెండు వాహనాలు ప్రమాదవశాత్తు ఢీకొనడంతో ఉషేనప్పకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వీరిని జిల్లా ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్ తరలించారు. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి కుటుంబ సభ్యులు కాశీనాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ సురేష్ తెలిపారు.

క్లుప్తంగా...

టీడీపీ 'సామాజిక' చిచ్చు

- సభా విలువలు.. సభాపతి స్థానంపై ఆ పార్టీకి గౌరవం లేదు
- వేళ్లు చూపిస్తూ.. సభ కనిపించకుండా ముఖానికి ప్లకార్డులు అడ్డుపెడతారా?
- ప్లకార్డు అడ్డు తొలగిస్తే స్పీకర్ కొట్టేశారంటూ గోల చేస్తారా?
- టీడీపీ సభ్యుల అనుచిత ప్రవర్తనపై స్పీకర్ తమ్మినేని సీతారాం ఆవేదన

'సభాపతి స్థానానికి కొన్ని పద్ధతులుంటాయి. వాటిని పట్టించుకోకుండా టీడీపీ సభ్యులు పోడియంపైకి వచ్చి నినాదాలు చేస్తారు. చైర్‌ను చుట్టిముట్టి గుద్దుతారు. నా ముఖంపై వేళ్లు చూపిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్నారు. డోలా వీరాంజనేయస్వామి ప్రవర్తించిన తీరు హేయంగా ఉంది. అచ్చెన్నాయుడు కింద నుంచే సభ కనిపించకుండా నా ముఖానికి ఎదురుగా ప్లకార్డు అడ్డుపెడతారు. ఎమ్మెల్యే ఎలిజా (వైఎస్సార్‌సీపీ) వచ్చి మా హక్కులు రక్షించాలని కోరుతుంటే.. టీడీపీ సభ్యుడు నా ముఖానికి అడ్డుగా పెట్టిన ప్లకార్డును పక్కకు జరిపాను. అది కింద పడిపోయింది. అంతే.. వెంటనే స్పీకర్ కొట్టేశారంటూ గోలచేశారు. ఇలా చేయమని మీకు ఎవరు చెప్పి పంపిస్తున్నారు? ఇది మంచి సంస్కారం కాదు'..

– ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాం

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అసెంబ్లీకి బ్లాక్‌డే

ఏపీ శాసనసభలో పరాకాష్టకు చేరిన టీడీపీ ఎమ్మెల్యేల అరాచకం


శాసనసభలో స్పీకర్ తమ్మినేని సీతారాంపై పేపర్లు విసురుతూ.. దాడి చేస్తున్న టీడీపీ సభ్యులు

సాక్షి, అమరావతి: ఈసారి అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నుంచి సభను అడ్డుకోవడమే లక్ష్యంగా నిత్యం రచ్చరచ్చ చేస్తున్న టీడీపీ సభ్యుల దుశ్చర్య సోమవారం పరాకాష్టకు చేరుకుంది. ఏకంగా సభాపతి తమ్మినేని సీతారాంపై దాడికి తెగబడ్డారు. సభా సంప్రదాయాలను తుంగలో తొక్కుతూ చరిత్రలో ఎన్నడూలేని విధంగా టీడీపీ ఎమ్మెల్యేలు తమ వికృత చేష్టలను బయటపెట్టారు. సభ సోమవారం ఉదయం ప్రారంభం కాగానే జీఓ–1 రద్దు మీద తామిచ్చిన వాయిదా తీర్మానంపై చర్చకు టీడీపీ సభ్యులు పట్టుబట్టారు. ప్రశ్నోత్తరాల తర్వాత వాయిదా తీర్మానంపై నిర్ణయం తీసుకుంటానని చెబుతూ స్పీకర్ క్వశ్చన్ అవర్‌ను ప్రారంభించారు. దీంతో అచ్చెన్నాయుడు స్పీకర్ వైపు వేలు చూపిస్తూ ముందు తామిచ్చిన వాయిదా తీర్మానాన్ని సభలో చదివి వినిపించాలంటూ బిగ్గరగా కేకలు వేశారు. టీడీపీ సభ్యులంతా ప్లకార్డులతో వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు చేయడం మొదలు


టీడీపీ సభ్యుల దాడిలో గాయపడిన దళిత ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

పెట్టారు. స్పీకర్ టేబుల్‌పై ఉన్న పుస్తకాలు, పత్రాలు చించివేస్తూ ఆయన ముఖంపైకి విసరడం ప్రారంభించారు. స్పీకర్ అటెండర్‌ను పక్కకు తోసేసిన టీడీపీ ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామి స్పీకర్‌కు అడ్డంగా నిలబడి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అంతేకాకుండా స్పీకర్ ముఖంపై ప్లకార్డును అడ్డంగా పెట్టడంతో పాటు ఆయనపై చేయిచేసుకున్నారు. ప్లకార్డు స్పీకర్ కంటికి తగలడంతో ఆయన దాన్ని పక్కకు తోసివేయడంతో అది కిందపడింది. దీంతో డోలా బాలవీరాంజనేయస్వామితో పాటు టీడీపీ సభ్యులు స్పీకర్ చైర్ చుట్టూ మూగి ఆయనపై దాడికి తెగబడ్డారు.

ఎస్సీ ఎమ్మెల్యేలపై దాడి..

అదే సమయంలో.. తమ హక్కులు కాపాడాలంటూ వెల్ బయటి నుంచి విన్నవిస్తున్న చింతలపూడి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా సభాపతిపై జరుగుతున్న దాడిని గమనించి పోడియం పైకెళ్లి టీడీపీ ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామిని అడ్డుకోవడంతో ఆయనను టీడీపీ సభ్యులు తోసేశారు. స్పీకర్‌తోపాటు సహచర ఎమ్మెల్యే ఎలీజాపై టీడీపీ సభ్యులు భౌతిక దాడి చేస్తుండడంతో సంతనూతలపాడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పోడియంపైకి వచ్చి వారిని అడ్డుకోబోయారు. ఆయనపైనా దాడికి పాల్పడుతూ పక్కకు తోసేయడంతో సుధాకర్‌బాబు పోడియం హ్యాండ్ రెయిలింగ్‌పై పడిపోయారు. దీంతో సుధాకర్‌బాబు ఎడమ మోచేతికి గాయమైంది.

డిప్యూటీ సీఎంపై 'డోలా' అనుచిత వ్యాఖ్యలు

తనపై జరిగిన దాడితో పాటు సభలో టీడీపీ సభ్యుల దుశ్చర్యకు మనస్తాపం చెందిన స్పీకర్ సీతారాం సభ నుంచి తన చాంబర్‌లోకి వెళ్లిపోయారు. రోజూ రచ్చచేయడం టీడీపీ సభ్యులకు అలవాటుగా మారిందని, ఈరోజు ఏకంగా సభాపతిపైనే దాడులకు తెగబడ్డారంటూ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అనడంతో.. 'నువ్వొక డిప్యూటీ సీఎం అంట్రా.. పనికిమాలిన నా కొడకా'.. అంటూ డోలా బాలవీరాంజనేయ స్వామి పరుష పదజాలంతో నానా దుర్భాషలాడడంతో మిగిలిన సభ్యులు ఆయన్ని వారించారు. అర్ధగంట అనంతరం సభ తిరిగి ప్రారంభమైన తర్వాత టీడీపీ సభ్యులను ఒకరోజు సస్పెన్షన్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. దీంతో తమను బయటకు పంపేందుకు ప్రయత్నిస్తున్న మార్షల్స్‌పైనా టీడీపీ సభ్యులు పిడిగుద్దులతో దాడికి దిగారు.

అప్రూవర్‌గా ప్రకటించడం చట్టవిరుద్ధం

వివేకా హత్య కేసులో దస్తగిరి బెయిల్ రద్దు చేయాలి

- వాచ్‌మన్ రంగన్న వాంగ్మూలాన్ని సీబీఐ పరిగణనలోకి తీసుకోవట్లేదు
- తమకు కావాల్సిన విధంగా ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారు
- తెలంగాణ హైకోర్టులో వైఎస్ భాస్కర్‌రెడ్డి పిటిషన్

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ ఆదేశించినట్లుగా ఏ–4 దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడని, దాని ఆధారంగా కేసుతో ఎలాంటి సంబంధంలేని వారిని ఇరికించాలని దర్యాప్తు సంస్థ ప్రయత్నిస్తోందని వైఎస్ భాస్కర్‌రెడ్డి తెలంగాణ హైకోర్టుకు నివేదించారు. దస్తగిరిని అప్రూవర్‌గా ప్రకటించడం చట్టవిరుద్ధమని, అతడికి బెయిల్ ఇచ్చే సమయంలో కింది కోర్టు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. దస్తగిరి చెప్పిన వివరాల ఆధారంగా తనతోపాటు మరి కొందరిని నిందితులుగా చేర్చే అవకాశం ఉందన్నారు. 'దస్తగిరిని అప్రూవర్‌గా ప్రకటించడాన్ని, బెయిల్ ఇస్తూ కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలి. నన్ను, మరికొందరిని నిందితులుగా చేర్చవద్దని ఆదేశాలు ఇవ్వాలి'అని అభ్యర్థిస్తూ వైఎస్ భాస్కర్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా ఈ పిటిషన్‌లోనూ వైఎస్ వివేకా కుమార్తె సునీత ఇంప్లీడ్ అయ్యారు. 'దస్తగిరి వాంగ్మూలం ఆధారంగా మమ్మల్ని నేరంలోకి నెట్టడం సమంజసం కాదు. వివేకా హత్య కేసులో దస్తగిరి కీలక పాత్ర పోషించాడు. హత్యకు ఆయుధాన్ని కొనుగోలు చేసింది అతడే. దస్తగిరికి బెయిల్ ఇచ్చేందుకు సీబీఐ పూర్తిగా సహకరించింది. దస్తగిరిపై వాచ్‌మన్ రంగన్న చెప్పిన అంశాలను కిందికోర్టు పట్టించుకోలేదు'అని వైఎస్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్ భాస్కర్‌రెడ్డి పిటిషన్‌లో మరికొన్ని అంశాలివీ..



● అన్ని ప్రశ్నలకూ సమాధానమిచ్చా...

నా వయసు సుమారు 73 ఏళ్లు. దీర్ఘకాలిక వెన్నునొప్పి, ఛాతీలో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నా. ఇప్పటికే సీబీఐ విచారణకు హాజరయ్యా. దర్యాప్తు అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చా. సీఆర్‌పీసీ సెక్షన్ 161, 164 కింద వివేకా వాచ్‌మన్ రంగన్న స్టేట్‌మెంట్‌ను దర్యాప్తు సంస్థ రికార్డ్ చేసింది. దాని ప్రకారం.. హత్య జరిగిన రోజు రంగన్న నిద్రలో ఉండగా అకస్మాత్తుగా పాత్రలు, ఇనుప రాడ్ పడిపోవడం వంటి శబ్దాలు వినపడటంతో లేచి ప్రధాన ద్వారం వద్దకు వెళ్లాడు. లోపలి నుంచి ఏడుపు లాంటి శబ్దం వినిపించడంతో పార్క్ వైపు ఉన్న ద్వారం వద్దకు వెళ్లి పక్కనే ఉన్న కిటికీ లోంచి లోపలికి చూశాడు. ఇంట్లో నలుగురు వ్యక్తులు కనిపించారు. వాళ్లు హాల్‌లో ఏదో వెతుకుతూ కనిపించారు. వారిలో ముగ్గురిని ఎర్ర గంగిరెడ్డి, షేక్ దస్తగిరి, సునీల్ యాదవ్‌గా గుర్తించాడు. నాలుగో వ్యక్తి పొడవుగా, సన్నగా ఉన్నట్లు చెప్పాడు. ఆ తర్వాత రంగన్న చీకటిగా ఉన్న తోటలోని చెట్టు దగ్గర దాక్కున్నాడు. దాదాపు 20 నిమిషాల తర్వాత పార్క్ వైపు ద్వారం తెరిచి సన్నగా, పొడవుగా ఉన్న వ్యక్తితోపాటు దస్తగిరి, సునీల్ హడావుడిగా వచ్చి కాంపౌండ్ వాల్ దూకి పారిపోయారు. అక్కడ దొరికిన ఆధారాల మేరకే పోలీసులు నలుగురిని నిందితులుగా పేర్కొన్నారు.

● మమ్మల్ని ఇరికించే ప్రయత్నం..

ఆ నలుగురే ఈ హత్య చేసినట్లు రంగన్న స్టేట్‌మెంట్ చాలా స్పష్టంగా చెబుతున్నా ఈ కేసుతో ఎలాంటి సంబంధంలేని నాతోపాటు మరికొందరిపై ఆరోపణలు చేస్తూ ఇరికించేందుకు దర్యాప్తు సంస్థ అక్రమ పద్ధతులను అనుసరిస్తోంది. వివేకా కుమార్తె సునీత, దర్యాప్తు అధికారులు వారికి తోచిన చట్టవిరుద్ధ ప్రక్రియలను ఆశ్రయిస్తున్నారు. ఇందులో భాగంగానే దస్తగిరికి కొన్ని సూచనలు చేసి వారికి కావాల్సిన విధంగా వాంగ్మూలం తీసుకున్నారు. దీంతో దస్తగిరి.. ఏ–5(శివశంకర్‌రెడ్డి)తో పాటు నాపై, మరో ఇద్దరిపై నిరాధార ఆరోపణలు చేశాడు.

● సుప్రీం ఉత్తర్వులను పట్టించుకోకుండా...

మరో ఇద్దరికి కూడా సీబీఐ నోటీసులు జారీ చేసి విచారణకు పిలవనున్నట్లు మీడియా కథనాల ద్వారా తెలిసింది. దస్తగిరి గూగుల్ టేక్ అవుట్ డేటా ఆధారంగా చేసుకుని సీబీఐ నాపై ఆరోపణలు మోపుతోంది. నాకు వ్యతిరేకంగా దర్యాప్తు చేస్తోంది. సీబీఐ అనుసరించిన విధానం పూర్తిగా చట్టవిరుద్ధం. హత్య కేసులో నిందితుడైన కిరాయి హంతకుడికి ముందస్తు బెయిల్ ఇవ్వకూడదని సుప్రీం కోర్టు పలుమార్లు తీర్పులిచ్చింది. అప్రూవర్‌గా మారిన దస్తగిరి వాంగ్మూలం ఆమోదయోగ్యం కాదు. దస్తగిరి చెప్పిన దానికి ఎలాంటి సాక్ష్యం లేదు. నేరంలో నలుగురు పాలుపంచుకున్నారు. వీరిలో తక్కువ నేరం చేసిన వారు జైలులో ఉండగా కీలక పాత్ర పోషించిన దస్తగిరికి మాత్రం బెయిల్ ఇవ్వడం సరికాదు. గంగిరెడ్డి ఆదేశాల మేరకు హత్యలో దస్తగిరి కీలక పాత్ర పోషించాడు. దీని కోసం భారీ మొత్తంలో నగదు కూడా తీసుకున్నాడు. ఆయుధాన్ని తెచ్చానని, హత్యలో ప్రధాన పాత్ర పోషించానని కూడా ఒప్పుకున్నాడు. ఈ అంశాన్ని కిందికోర్టు మేజిస్ట్రేట్ పరిగణలోకి తీసుకోలేదు. బెయిల్ ఇచ్చేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా వివరణ తీసుకోవాల్సి ఉండగా అలా చేయలేదు. అప్రూవర్‌గా మారడం, బెయిల్ ఇవ్వడం అంతా చట్టవిరుద్ధంగానే జరిగింది. బెయిల్ మంజూరు చేస్తూ కిందికోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేయాలి. దస్తగిరి వాంగ్మూలం ఆధారంగా నన్ను నిందితుడిగా చేర్చవద్దని సీబీఐని ఆదేశించాలి.

▶ మొదటి పేజీ తరువాయి

'స్కిల్డ్' క్రిమినల్ స్కామ్!

సీమెన్స్ పేరుతో స్కామ్ జరిగింది. ఇలాంటి గొప్ప స్కామ్‌ను నడిపిన వ్యక్తి నారా చంద్రబాబే. అక్షరాలా రూ.371 కోట్ల ప్రజాధనాన్ని మాయం చేశారు. ఈ డబ్బును షెల్ కంపెనీల ద్వారా రకరకాల రూటింగ్ చేసి మళ్లీ చంద్రబాబు నివాసం ఉంటున్న హైదరాబాద్‌కు తరలించారు. స్కిల్డ్ క్రిమినల్ చేసిన స్కామ్ ఇది. ప్రజాధనాన్ని దోచేయడంలో చంద్రబాబు చాతుర్యం చూడాలంటే స్కిల్ స్కామ్‌ను ఉదాహరణగా చెప్పవచ్చు.

ముందుగానే ఊహించి..

చేయని స్కిల్ డెవలప్‌మెంట్ ఎలా చూపించాలి..? దోచేసిన డబ్బును ఎలా జేబులోకి తెచ్చుకోవాలి..? చట్టానికి దొరక్కుండా ఏ ఫైల్స్‌ను ముందుగానే మాయం చేయాలి..? దర్యాప్తు జరిగితే తప్పించుకోవడానికి ఏం చేయాలి..? అసలు విచారణ జరగకుండా ఏం చేయాలి..? ఇవన్నీ ముందుగానే ఊహించుకుని రూపకల్పన చేశారు. ఒక క్రిమినల్ మాత్రమే ఇలా చేయగలుగుతాడు. అవినీతికి నిజంగానే విజన్ ఆయన. 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే ఈ స్కిల్ స్కామ్ ఊపిరి పోసుకుంది. ఇందుకోసం తనకు కావాల్సిన మనుషులను చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లోకి తీసుకొచ్చారు. సీమెన్స్ కంపెనీలో ఓ ఉన్నతోద్యోగిగా ఉన్న వ్యక్తితో లోపాయికారీగా వీళ్లు లాలూచీ పడ్డారు. అతడి ద్వారా దోపిడీకి పాల్పడ్డారు. ఈ ప్రాజెక్టు ఖర్చు రూ.3,356 కోట్లు. ఇందులో ప్రభుత్వ వాటా 10 శాతం, సీమెన్స్ కంపెనీ 90 శాతం భరిస్తుందన్నారు. ప్రపంచంలో ఎక్కడైనా ఓ ప్రైవేట్ కంపెనీ రూ.3 వేల కోట్ల గ్రాంట్ ఇస్తుందా..? పోనీ చంద్రబాబు ముఖాన్ని చూసి ఇస్తారా...? రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా ప్రాజెక్టు తీసుకోవాలంటే ఒక పద్ధతి ఉంటుంది. కానీ ఇక్కడ డీపీఆర్ కూడా తయారు చేయలేదు. ముందస్తుగానే ఆ కంపెనీలో లాలూచీ పడ్డ ఇద్దరు వ్యక్తులు రూపొందించిన డీపీఆర్‌ను స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఒక నోట్ పెట్టించారు. కనీసం టెండర్ లాంటి ప్రక్రియ కూడా ఈ ప్రాజెక్టులో లేదు. చంద్రబాబుకు మాత్రమే ఇటువంటిది సాధ్యం. ఈ స్కామ్.. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత తవ్వింది కాదు. చంద్రబాబు హయాంలోనే ఇది బయటకు పొక్కింది. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, ఎల్లో మీడియా ఏ ఒక్కరూ మాట్లాడలేదు. చివరకు దత్తపుత్రుడు కూడా అడగలేదు. దోచుకో, పంచుకో, తినుకో (డీపీటీ).. ఇదే వీళ్ల విధానం.

గ్రాంట్ అనే పదమే లేకుండా ఒప్పందం

రాష్ట్రంలో 6 క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని, ఒక్కో క్లస్టరులో ఒక్కో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అని, 5 టెక్నికల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్స్ కూడా ఏర్పాటు చేస్తామని జీవోలో చెప్పారు. ఒక్కో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు రూ.546 కోట్లు ఖర్చు చేస్తామని, ఇందులో 90 శాతం ఖర్చును సీమెన్స్, డిజైన్‌టెక్ గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద అందిస్తుందని, మిగిలిన 10 శాతం అంటే ఒక్కో సెంటర్‌కు రూ.50 కోట్లు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం భరించాలని చెప్పారు. ప్రాజెక్టు వ్యయంలో పది శాతం, పన్నులతో కలిపి రూ.371 కోట్లను ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. మిగిలిన రూ.3 వేల కోట్లను సీమెన్స్ సంస్థ గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా ఉదారంగా ఇస్తుందంటూ కేబినెట్‌లో చెప్పారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద వచ్చిందంటే ఆ డబ్బును మనం తిరిగి ఇవ్వాల్సిన అవసరం లేదు. అయితే ఒప్పందం దగ్గరకు వచ్చేసరికి 90 శాతం గ్రాంట్ ఇన్ ఎయిడ్ ప్రస్తావన పూర్తిగా ఎగిరిపోయింది. ఆ పదమే ఎక్కడా కనిపించలేదు. ప్రభుత్వం ఇవ్వాల్సిన 10 శాతం వాటా కాస్తా రూ.330 కోట్లు ఫైనాన్షియల్ అసిస్టెన్స్‌గా మారిపోయింది. కుంభకోణానికి ఇక్కడే బీజం పడింది. ఒప్పంద పత్రంలో వివరాలు నింపాల్సిన చోట ఖాళీగా విడిచిపెట్టారు. ఏ తేదీన ఒప్పందం కుదిరిందన్న విషయాన్ని కూడా రాయలేదు. జీవోలో ఉన్నది ఒప్పందంలో లేనప్పుడు ఎలా సంతకాలు చేశారు?

సీమెన్స్ నుంచి పైసా రాలేదు

గత ప్రభుత్వం 10 శాతం నిధులను విడుదల చేసినప్పుడు సీమెన్స్ కంపెనీ నుంచి రావాల్సిన గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఒక్క పైసా కూడా రాలేదు. అసలు ఆ ప్రాజెక్టు గురించే ఆ కంపెనీకి తెలియదు. గత ప్రభుత్వం ఐదు దఫాల్లో రూ.371 కోట్లు విడుదల చేసింది. ఆ మొత్తం షెల్ కంపెనీల నుంచి చంద్రబాబుకు చేరిన వెంటనే దఫాల వారీగా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేశారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ


అవార్డులతో జిల్లా క్రీడాకారులు

కందనూలు: హైదరాబాద్‌లోని గోల్కొండ ఆర్టిలరి సెంటర్ స్టేడియంలో నిర్వహించిన ఖేలో ఇండియా ఉమెన్ లీగ్ అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయిలో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి స్వాములు తెలిపారు. జిల్లా క్రీడాకారులు సంధ్య 100మీటర్ల పరుగు పందెంలో రజతం, 200 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించారు.

యోగా క్రీడాకారులు నివేదించాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: జాతీయస్థాయికి ఎంపికైన ఉమ్మడి జిల్లా యోగా క్రీడాకారులు ఈనెల 22న సాయంత్రం 4 గంటలకు జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో రిపోర్ట్ చేయాలని జిల్లా యోగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.రాములు, బాల్‌రాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజస్తాన్ రాష్ట్రంలో పాలిలో ఈనెల 25 నుంచి 28 వరకు జరిగే జాతీయస్థాయి యోగా టోర్నీలో పాల్గొంటారని పేర్కొన్నారు. నాలుగు ఫొటోలు, ఆధార్‌కార్డు, మెడికల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆయన కోరారు. అండర్ 18–21 విభాగంలో స్వప్న, సాగర్, అండర్ 21–25లో బాలమణి, దేవేందర్, సతీష్; అండర్ 25–30లో శ్రీకాంత్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు.

తుమ్మిళ్ల లిఫ్టు ద్వారా నీటి విడుదల

రాజోళి: తుమ్మిళ్ల ఎత్తిపోతల ద్వారా సోమవారం అధికారులు నీటిని విడుదల చేశారు. తుంగభద్రనది నుంచి నీరు రావడంతో నదిలో ఎఫ్‌ఆర్‌ఎల్ 291.5 మీటర్ల స్థాయిలో ఉండటంతో, అధికారులు లిఫ్టు వద్ద ఉదయం 10 గంటలకు మోటార్ ఆన్ చేశారు. దీని ద్వారా ఆర్డీఎస్ కెనాల్ డీ–23 వద్ద డెలవరీ సిస్టర్న్ ద్వారా ఆయకట్టు కెనాల్‌కు నీరు అందింది. గురువారం నిలిచిన తుమ్మిళ్ల నీరు తాజాగా సోమవారం విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నదిలో నీటి లభ్యత లేని కారణంగా, ఇరు రాష్ట్రాలు పెట్టిన ఇండెంట్ వల్ల నీరు నిలిచినప్పటికీ, ప్రస్తుతం నీరు రావడంతో పంటలకు తడులు అందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సేంద్రియ వ్యవసాయంపై దృష్టిసారించాలి

తెలకపల్లి: సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని పాలెం వ్యవసాయ శాస్త్రవేత్తలు మమత, మల్లారెడ్డి, శ్రీవాణి అన్నారు. సోమవారం మండల పరిధిలోని అనంతసాగర్‌లో వేరుశనగ పంటపై శిక్షణ, పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు అవగాహన సదస్సు నిర్వహించారు. 'వేరుశనగ డిగ్గర్‌తో పంట కోత' అనే అంశంపై వివరించారు. వేరుశనగ జాతీయ బృందం సభ్యులు పాల్గొని రైతులతో పంటల వివరాలు సేకరించారు. పంట వివరాలు వారికి కావాల్సిన సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. వేరుశనగ పంటలో యాంత్రీకరణ ఎంతో అవసరమని ఆ దిశగా పాలెం ప్రాంతీయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలను వారు అభినందించారు. వేరుశనగలో కొత్త రకాలను ఎంచుకుని సాగు చేసుకోవాలని, ఖర్చు తగ్గించుకునే దిశగా వ్యవసాయం సాగించాలన్నారు. సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించాలని దాంతో అధిక ఖర్చులు తగ్గించుకోవచ్చని, మంచి దిగుబడులు వస్తాయన్నారు. సహపరిశోధన సంచాలకులు ఎం.మల్లారెడ్డి, నూనె గింజల ప్రధాన శాస్త్రవేత్త శ్రీవాణితో పాటు, జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రైతులు ఏ సమయాల్లో ఎలాంటి పంట చర్యలు తీసుకోవాలి, ఎలాంటి పంటలు సాగు చేయాలని, ఎంత మోతాదులో ఏ సమయాల్లో ఎరువులు వేసుకోవాలో అవగాహన కల్పించారు. ప్రతి సంవత్సరం పంట మార్పిడి చేసుకోవాలని సూచించారు.


వేరుశనగ పంటపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

డిగ్గర్‌తో ప్రయోగాత్మకంగా..

అనంతరం వేరుశనగ డిగ్గర్‌తో ప్రయోగాత్మకంగా రైతు పొలంలో పంట కోతను ప్రదర్శించారు. రైతుకు తమకు వేరుశనగ డిగ్గర్‌వంటి యంత్రాలు కావాలని, ఇసక నేలల్లో ఈ యంత్రం సామర్థ్యం బాగానే ఉన్నా, ఎర్ర నేలల్లో మరింత సామర్థ్యం ఉన్న యంత్రాలు అవసరని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లుతో పాటు మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ రెడ్డి, సర్పంచ్ లక్ష్మయ్య, ఎంపీపీ కొమ్ము మధు, ఎంపీటీసీ రమేశ్, రైతుబంధు అధ్యక్షుడు మాధవరెడ్డి, పాలెం శాస్త్రవేత్తలు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

అక్రమ కేసులతో ఎస్‌ఐ వేధింపులు

కలెక్టరేట్‌లో మాజీ సైనికుడి ఫిర్యాదు

కందనూలు: అక్రమ కేసులు పెట్టి బిజినేపల్లి ఎస్‌ఐ తనని వేధిస్తున్నాడని సోమవారం మాజీ సైనికుడు వెంకటయ్య సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నెలలో పాలెంలో మెయిన్ రోడ్డుపై ఉన్న సుబ్బయ్య విగ్రహానికి అడ్డంగా రాజకీయ నాయకుల ఫోటోలతో ఉన్న ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని, ఈ విషయంపై మన ఊరు పాలెం గ్రామం వాట్సాప్ గ్రూపులో సుబ్బయ్య విగ్రహం కనిపించకుండా అడ్డంగా ఉన్న ఫ్లెక్సీలను తొలగించాలని విజ్ఞప్తి చేస్తే బీఆర్‌ఎస్ నాయకులు నాపై అక్రమ కేసులు బనాయించారన్నారు. మున్సిపల్ నిబంధనలు ఉల్లంఘించి, ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన వాటిపై జరిమానాలు విధించాలని మంత్రి కేటీఆర్ చాలాసార్లు వివిధ పత్రికలు, న్యూస్ ఛానల్ ద్వారా సూచించారని, అయినా ఇక్కడి నియోజకవర్గ నాయకులు నిబంధనలు ఉల్లంఘించి, రోడ్లపై అడ్డంగా కడుతున్నా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఫ్లెక్సీలు అడ్డంగా పెట్టిన వాటిని పక్కకు కట్టుకోవాలని విజ్ఞప్తి చేస్తే అక్రమ కేసులు పెట్టడమే కాకుండా, సీఆర్‌పీసీ 41 నోటీసు ఇవ్వకుండా బిజినేపల్లి ఎస్‌ఐ స్టేషన్ పిలిపించుకుని మరీ బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. మా ఎమ్మెల్యే గురించి నీకు అవసరమా.. అంటూ దుర్భాషలాడుతూ, ఫోన్ లాక్కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్స్ ఆర్మీ ఐడీ కార్డ్, డాక్యుమెంట్స్ ఇవ్వకుంటే నీపై మరిన్ని కేసులను పెడుతానని బెదిరించారని చెప్పారు. తనను కేసులతో వేదిస్తున్న ఎస్‌ఐ, అందుకు ప్రోత్సహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.


ప్రజావాణిలో ఫిర్యాధు చేస్తున్న మాజీ జవాన్ వెంకటయ్య

ప్రాంగణ ఎంపికలో 27 మందికి ఉద్యోగాలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక జేపీఎన్‌సీఈలో సోమవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 27 మంది అభ్యర్థులకు ఉద్యోగాలు దక్కాయి. అనంతరం వీరిని కళాశాల చైర్మన్ కేఎస్ రవికుమార్ అభినందించారు. కాగా, హైదరాబాద్‌కు చెందిన 24/7 ఎ.ఐ. కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 260మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 24/7 ఎ.ఐ. కంపెనీ ప్రతినిధి నరేందర్, జేపీఎన్‌సీఈ ప్రిన్సిపాల్ డా.ఎ.సుజీవన్‌కుమార్, టాస్క్ కో–ఆర్డినేటర్ సిరాజుద్దీన్, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా.గురురాఘవేంద్రారెడ్డి, కార్యక్రమ కో–ఆర్డినేటర్ ఎ.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

❒ జేపీఎన్‌సీఈలో ఇంజినీరింగ్ విద్యార్థులకు త్వరలో రొబొటిక్ ఎంబెడెడ్ సిస్టంపై శిక్షణ ఇవ్వనున్నారు. దీని కోసం హైదరాబాద్‌కు చెందిన టెక్సొహం కంపెనీతో కళాశాల యాజమాన్యం ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా సోమవారం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జేపీఎన్‌సీఈ చైర్మన్ కేఎస్ రవికుమార్, టెక్సొహం కంపెనీ ప్రతినిధులు కె.సహదేవ్, మంజులత పాల్గొన్నారు.



ఒప్పందం కుదుర్చుకుంటున్న జేపీఎన్‌సీఈ చైర్మన్ రవికుమార్, టెక్సొహం కంపెనీ ప్రతినిధులు

చౌకబారు విమర్శలు చేయొద్దు

అచ్చంపేట రూరల్: గువ్వల బాలరాజు సంపాదనలో 5 శాతం తనకున్నా వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ అన్నారు. గువ్వల బాలరాజు ఎంపీ, ఎమ్మెల్యేగా పోటీ చేసిన సమయంలో అఫిడవిట్‌లో రూ.వందల కోట్లు ఉన్నట్లు పొందుపర్చారని ఆ సంపాదనంతా ఎక్కడిదని ప్రశ్నించారు. సోమవారం అచ్చంపేటలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అచ్చంపేటకు ప్రజా సేవ చేయడానికి రాలేదని దోచుకోవడానికి వచ్చారని ఆరోపించారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచి అచ్చంపేటను అభివృద్ధి చేయలేదని, అప్రతిష్టపాలు చేశారని, రాజకీయ పదవులు అమ్ముకున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ పార్టీలో ఎన్నో ఏళ్లుగా పనిచేసిన నాయకులకు మొండిచేయి చూపారని, కార్యకర్తలు గ్రహించాలని తామంతా అచ్చంపేట నియోజకవర్గ వాసులమని తమ మధ్య విబేధాలను గువ్వల సృష్టిస్తున్నారని ఆరోపించారు. అచ్చంపేట అపరిచితుడిలా వ్యవహరిస్తున్నారని, కార్యకర్తలను, ప్రజలకు కొట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని దుయ్యబట్టారు. ఒక డాక్టర్‌గా చెబుతున్నా.. గువ్వలను ఎర్రగడ్డ ఆస్పత్రిలో చేర్చి ఎలక్ట్రికల్ షాక్ పెట్టించాలని అన్నారు. చౌకబారు విమర్శలు చేయడం సరైంది కాదని, నియోజకవర్గ ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారన్నారు. సమావేశంలో నాయకులు శ్రీనివాసులు, గౌరీశంకర్, మల్లేష్, శ్రీనివాసులు, కాశన్నయాదవ్, గోపాల్‌రెడ్డి, మహబూబ్‌అలీ, అజయ్, అంజి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ

జాతీయస్థాయిలో ఉపాధ్యాయుడి గుర్తింపు

గద్వాల: జిల్లాకు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు రవిశంకర్‌కు జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. జాతీయ విద్యావిధానం– విద్యా అమృత్ మహోత్సవాలలో భాగంగా ఎన్‌సీఈఆర్‌టీ వినూత్న బోధన పద్ధతులపై ఆన్‌లైన్ ద్వారా పోటీలను నిర్వహించింది. ఉండవెల్లి మండలం పుల్లూరు జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు రవిశంకర్ అధునాతన సాంకేతికతను జోడించి విద్యార్థులకు పాఠాలను ఆసక్తికరంగా బోధిస్తున్నాడు. ప్రత్యేకంగా ఓ యాప్‌తో తన సెల్‌ఫోన్‌ను ప్రాజెక్టరుకు అనుసంధానించి స్క్రీన్‌పై బొమ్మలను చూపిస్తూ పాఠ్యాంశాలను అర్థమయ్యేలా వివరిస్తున్నారు. బోధన పద్ధతుల వీడియోలను ప్రభుత్వం రూపొందించిన దీక్ష పోర్టల్‌లో ఉంచారు. అత్యధిక వీక్షకులు వీక్షించే వీడియోలలో టాప్–3 బోధన పద్ధతులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అందులో జిల్లాకు చెందిన రవిశంకర్ ప్రాజెక్టు మొదటిస్థానంలో నిలిచింది.

నోటి సమస్యలపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య విద్యార్థులు

పాలమూరు: ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఎస్‌వీఎస్ డెంటల్ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఎస్‌వీఎస్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆ తర్వాత బస్టాండ్‌లో ప్రత్యేక నాటకంతో నోటి ద్వారా వచ్చే వ్యాధులను ప్రయాణికులకు తెలియజెప్పారు. దీంతో పాటు నోటి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అలాగే జిల్లాకేంద్రంలోని ఏనుగొండలో ఉన్న సన్నిధి, శాంతివనం, రెడ్‌క్రాస్ అనాథ శరణాలయంలో 75 మంది విద్యార్థులకు దంతాలు, ఇతర నోటి సమస్యలకు పరీక్షలు చేసి చికిత్స అందించారు. వైద్యులు కళాధర్‌రెడ్డి, జితేందర్ పాల్గొన్నారు.

సాగునీటిలో పాలమూరుకు అన్యాయం

పాలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ఆర్డీఎస్ నీటిని సాధించి ఉంటే.. కొత్తగా చిన్నోనిపల్లి రిజర్వాయర్ పనులు చేపట్టే అవసరం లేదని, గత తొమ్మిదేళ్లుగా పాలమూరు జిల్లాకు సాగునీటి పథకాల పట్ల ఈ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎప్పుడు ఏది తోస్తే అది చేస్తూ అదే గొప్ప విషయం అయినట్లు ప్రచారం చేసుకుంటుందని విమర్శించారు. 2005 నుంచి చిన్నోనిపల్లి రిజర్వాయర్ కింద సాగు భూమి లేదని, ఇక్కడ చెరువు నిర్మిస్తే, భూమి నష్టం తప్ప ఏం లాభం ఉండదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలమూరు జిల్లాకు అన్యాయం జరిగితే స్వరాష్ట్రంలోనూ అన్యాయమే జరుగుతుందన్నారు. ఈ ప్రభుత్వ విధానాలను ప్రతిఒక్కరూ ఖండించాలని కోరారు.